సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



రిమ్స్ 'ఫార్మసీ'లో అస్తవ్యస్తం!

కడప రిమ్స్ ఫార్మసీ విభాగంలో కొందరు సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. మందుల సరఫరాలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. -10లో



విజేతలుగా వెస్ట్ గోదావరి జట్లు

ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌లుగా పశ్చిమగోదావరి జట్లు నిలిచాయి. సోమవారం కడపలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 249 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	325	473
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 295.740 కిలోలు

న్యూస్‌రీల్

నీట్‌లో రాజంపేట వాసి ప్రతిభ



సందీప్

రాజంపేట టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీగా పనిచేస్తున్న మేజర్ విజయభాస్కర్ కుమారుడు డాక్టర్ చెరుకుపల్లి సందీప్ నీట్ (సూపర్ స్పెషాలిటీ)లో ఆల్‌ఇండియా స్థాయిలో 247వ ర్యాంకు సాధించాడు. ఈ విషయాన్ని ఆయన సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. నీట్ పోటీ పరీక్షలో దేశవ్యాప్తంగా 8,300 మంది పాల్గొన్నారని తెలిపారు. తాను ఎంబీబీఎస్, ఎండీ (జనరల్ మెడిసిన్) కర్నూలులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదివానని, ప్రస్తుతం తనకు నీట్‌లో వచ్చిన ర్యాంకుకు ఏ విభాగంలోనైనా సీటు వస్తుందని వెల్లడించారు. పేద, మధ్య తరగతి రోగులకు సేవచేయాలన్న ఆశయంతో కార్డియాలజీని తీసుకోనున్నట్లు సందీప్ తెలిపారు.

లాహిరి..లాహిరి..లాహిరిలో..



మానస సరోవరంలో అధికారుల షికారు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మానస సరోవరంలో సోమవారం బోటింగ్ షికారు ట్రయల్ రన్ జరిపారు. హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకులు నీటిలో బోటుపై షికారు చేసేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు పెడల్ బోట్లను కొనుగోలు చేసి తీసుకురాగా వీటిని మదనపల్లె ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ పూజలు నిర్వహించారు. తర్వాత మానస సరోవరంలో బోట్లను నడిపి పరీక్షించి పరిశీలించారు. బోటు షికారులో ఇబ్బందులు తలెత్తకపోవడంతో పర్యాటకుల కోసం సిద్ధం చేస్తున్నారు. హార్సిలీహిల్స్ ప్రకృతి అందాలను తిలకించే సందర్శకులకు బోటులో షికారు కొత్త అనుభూతి కలిగించనుంది.

నిరుద్యోగ మహిళలకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సిటీ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌కు గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు 30 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారై ఉండాలన్నారు. వివరాలకు 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

21న కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగ సందర్భంగా కడప మీదుగా తిరుపతి–సికింద్రాబాద్–తిరుపతి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. ఈనెల 21వ తేదీ శనివారం రాత్రి 10.05 గంటలకు సికింద్రాబాదులో బయలుదేరి తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 4.35 గంటలకు తిరుపతిలో బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.50 గంటలకు సికింద్రాబాదుకు చేరుతుందన్నారు.

కీలక నిర్ణయాలకు ఆమోదం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అకడమిక్ సెనెట్ స్టాడింగ్ కమిటీ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిసింది. సోమవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్ అధ్యక్షతన సమావేశం జరగింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నోటిఫికేషన్ జారీకానున్న నేపథ్యంలో పోస్టుల రోస్టర్, స్పెషలైజేషన్, పోస్టులకు కావాల్సిన అర్హతలు చర్చించి సెనెట్ అనుమతితో ఆమోదం తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి దూరవిద్య కోర్సులు అమలు చేసేందుకు ఆమోదించింది. అలాగే ఎంబీఏ, ఎంసీఏల నిర్వహణకు ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అకడమిక్ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నూతన విద్యాసంవత్సరం కోర్సులు, సిలబస్ అమలు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాల అమలుకు నిర్ణయం తీసుకున్నారు.

ప్రణాళికతోనే పదిలో ఉత్తమ ఫలితాలు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతిలో ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప సీఎస్ఐ స్కూల్‌లోని డీసీఈబీ హాలులో జోన్–4 పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించిన మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు 2023–24 పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇటీవలే 116 మంది టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి కల్పించామన్నారు. వీరంతా సహోపాధ్యాయులతో కలిసి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సబ్జెక్టు వారీగా ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు టైం టేబుల్ ఇవ్వాలని, దీనిని పాటించే విధంగా ప్రిన్సిపాళ్లు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

సకల సౌకర్యాలతో కలెక్టర్ బంగ్లా

- పనులు త్వరగా పూర్తి చేయాలి
- లోక్ సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ మిథున్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్



జిల్లా కలెక్టర్ బంగ్లా నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న ఎంపీ మిథున్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, నవాజ్ బాషా, జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి తదితరులు

రాయచోటి: అన్నమయ్య జిల్లాకు శాశ్వత కలెక్టర్ బంగ్లా నిర్మాణానికి త్వరగా పూర్తి చేయాలని లోక్ సభ ప్యానల్ స్పీకర్ ఎంపీ మిథున్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక రాయచోటి కలెక్టరేట్ సమీపంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ బంగ్లా నిర్మాణానికి లోక్‌సభ ఎంపీ మిథున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ బంగ్లా నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను కలెక్టర్ శంకుస్థాపన కార్యక్రమం దగ్గర ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డు ద్వారా ఎంపీ మిథున్ రెడ్డి, రాయచోటి, మదనపల్లి ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, నవాజ్ బాషా, జెడ్పీ చైర్మన్ అమరనాథ రెడ్డిలకు వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కొత్త జిల్లాకు కలెక్టర్‌కు శాశ్వత బంగ్లా, క్యాంపు ఆఫీసులు ఎంతగానో అవసరమన్నారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని ఎనులను చేపట్టామని, త్వరగా పూర్తి చేసేందుకు అధికారులకు సూచనలు జారీ చేశామని తెలిపారు.

అధికారులు సమన్వయం చేసుకోవాలి

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్‌కు శాశ్వత బంగ్లా నిర్మాణానికి అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బంగ్లా నిర్మాణానికి కలెక్టర్ గిరీషా పీఎస్ ఎంతో చొరవతీసుకున్నారని కొనియాడారు. ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చొరవతో కలెక్టర్‌కు శాశ్వత బంగ్లా నిర్మాణం జరుగుతోందని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాష, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, జిల్లా ఆర్అండ్‌బీ అధికారి సహదేవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పాల్గొన్నారు.

చట్టాలు, న్యాయవ్యవస్థను గౌరవిస్తాం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చట్టాలను, న్యాయవ్యవస్థను అనునిత్యం గౌరవిస్తూనే వస్తోందని రాజంపేట పార్లమెంట్ సభ్యులు లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పివి మిథున్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతికి అక్రమాలకు పాల్పడి పూర్తి ఆధారాలతో పట్టుబడి జైలుకెళ్లిన చంద్రబాబునాయుడును చూసి ఆ పార్టీ నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పై బురద జల్లే కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడిని సీఎం జగన్ గౌరవంతోనే సంబోధిస్తూ వచ్చారన్నారు. కేసులో పూర్తి ఆధారాలు లభించడంతో కేసు నుంచి బయటపడే మార్గం దొరక్క ఎటూ పాలుపోని స్థితిలో తప్పుడు ప్రచారాలకు టీడీపీ నేతలు దిగజారారని ఆరోపించారు.అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు.

అందరి ఆరోగ్య బాధ్యతలను ప్రభుత్వం చూస్తుంది

ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆరోగ్య బాధ్యతలను ప్రభుత్వం చూస్తోందని, ప్రతి ఒక్కరి పట్ల జగన్ ప్రభుత్వం బాధ్యతగానే పనిచేస్తుంది తప్ప తప్పించుకునే ప్రయత్నం చేయదన్నారు. దేశంలో చిదంబరం, లాలూప్రసాద్ యాదవ్ వంటివారు అవినీతికి పాల్పడే జైలుశిక్ష అనుభవించారని చెప్పారు. చంద్రబాబుది తప్పు కాదంటూ ఆ పార్టీ నాయకులు చెప్పుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ఎన్నికలలో గెలవలేమన్న భయంతో అరెస్టును బూచిగా చూపి సానుభూతిని పొందే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ''జగనన్నకు చెబుదాం–స్పందన'' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజనాచౌదరిపై సస్పెన్షన్ వేటు

మదనపల్లె: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అంజనాచౌదరిపై పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను సోమవారం పార్టీ అధిష్టానం మీడియాకు విడుదల చేసింది. రాష్ట్ర పార్టీ నియామకాలను బహిరంగంగా పత్రికా విలేకర్ల సమావేశంలో... పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పాక వెంకటసత్యనారాయణ పేర్కొన్నారు. బీజేపీలో డబ్బున్నవారికే పదవులు వస్తాయని, మహిళలపై నాయకుల వేధింపులు అధికమయ్యాయని, రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, తన సామాజికవర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారంటూ బీజేపీ మహిళా నాయకురాలు అంజనాచౌదరి వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్దపీట



ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు ,కలెక్టర్

చిన్నమండెం: ఆలయాల నిర్మాణాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా,కలెక్టర్ గిరీషా, కార్మిక, కర్మాగారముల, ఇన్సూ్యరెన్స్ వైద్య సేవల ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి, ఎంపీపీ సుధామాధురి పేర్కొన్నారు. సోమవారం దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె సమీపంలోని మండెం లక్ష్మీ నారసింహస్వామి ఆలయ నిర్మాణానికి బాలాలయ ప్రతిష్ట , భూమిపూజలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాట్లాడారు. చోళుల కాలంలో నిర్మించబడి గొప్ప చరిత్ర కలిగిన ఈ ఆలయ పునః నిర్మాణం చేపట్టడం హర్షదాయకమన్నారు. ఆలయ పునః నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు.

'సచివాలయ వ్యవస్థ' చరిత్రాత్మకం



కార్యాలయాల సముదాయ భవనాల శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

చిన్నమండెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ చరిత్రాత్మకంగా నిలుస్తోందని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి.శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా, అన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో నూతనంగా ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీల నూతన భవనాల ప్రారంభ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అలాగే రాయచోటి నియోజకవర్గంలో తొలి డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి ముంగిటకే సేవలందిస్తూ వలంటీర్ వ్యవస్థ ప్రజలకు భరోసా ఇస్తోందన్నారు.

చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలి

ఎస్పీ బి.కృష్ణారావు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ బి కృష్ణారావు

రాయచోటి: స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని ఎస్పీ బి.కృష్ణారావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ఎస్పీ స్పందన' ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు అందించిన ఫిర్యాదులపై వారితో మాట్లాడి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ప్రజలు కోరుకున్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. స్పందన ద్వారా 70 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

18న రాష్ట్ర స్థాయి సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కృష్ణానది జలాల పునఃపంపిణీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 18న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర సోమవారం పేర్కొన్నారు. కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగే సదస్సులో కృష్ణా జలాల పంపిణీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు నేతలు రామకృష్ణ, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, ఎంఏ గఫూర్, నీటిపారుదల రంగం నిపుణులు బొజ్జ దశరథ రామిరెడ్డి, ముప్పాల నాగేశ్వరరావు, ఓబులేసు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారన్నారు.

ముగిసిన పవిత్ర ఉత్సవాలు




పవిత్ర మాలలతో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివార్లు

గుర్రంకొండ; మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్ర ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా ఉదయాన్నే హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి కావించారు. పవిత్ర ఉత్సవాలు ఎటువంటి విఘాతం లేకుండా ముగిసినందున వరుణదేవుడ్ని ఆహ్వానిస్తూ పవిత్ర జలాలతో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వాహనంలో స్వామివారు కొలువుదీరి గ్రామ పురమాడవీధుల్లో మేళతాళాలతో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. టీటీడీ ఏఈఓ గోపినాథ్, డిప్యూటీ ఏఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ వెంకటస్వామి, అర్చకులు గోపాలా బట్టర్, కృష్ణ, అనిల్,రాజు, గోకుల్‌స్వాములు పాల్గొన్నారు.

రెక్కలు తొడిగి.. రెపరెపలాడి..

- కడప ఎయిర్‌పోర్టుకు మహర్దశ
- రూ. 224.05 కోట్లతో న్యూ టెర్మినల్ భవన నిర్మాణం
- మూడు ఏరో బ్రిడ్జిలు ఏర్పాటు
- నైట్ ల్యాండింగ్ పనులు పూర్తి



కడప ఎయిర్‌పోర్టు న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవనం నమూనా

కడప సిటీ : కడప విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రూ. 224.05 కోట్లతో న్యూ డొమెస్టిక్ బిల్డింగ్ నిర్మాణం, ఇతర పనులకు శ్రీకారం చుట్టేందుకు టెండర్లను కూడా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పిలిచింది. మరో మూడు నెలల్లో టెండర్లు పూర్తయి రెండేళ్ల కాలంలో అంటే మార్చి 2026కు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.ఇప్పటికే నైట్ ల్యాండింగ్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దనున్నారు.

రూ. 224.05 కోట్లతో పనులు

ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ. 224.05 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో 12,900 చదరపు మీటర్లలో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవన నిర్మాణాన్ని అత్యాధునిక సౌకర్యాలతో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి టెండర్లను పిలిచారు. తిరుపతి,విజయవాడ, రాజమండ్రి తరహాలో ఈ ఎయిర్‌పోర్టును సర్వాంగ సుందరంగా మార్చనున్నారు. మూడు ఏరో బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇవి పూర్తయితే టెర్మినల్ భవనం నుంచి నేరుగా విమానంలోకి చేరుకునే అవకాశం ఉంటుంది. వర్షం వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులు విమానం వద్దకు చేరుకోవచ్చు. ప్రస్తుతం బస్సు ద్వారా అక్కడికి చేరుకుంటారు.

పెద్ద విమానాలు వచ్చేందుకు అవకాశం

కడప విమానాశ్రయంలో పెద్ద విమానాలు రాకపోకలు సాగించేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నైట్ ల్యాండింగ్‌కు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అనుమతి వచ్చిన తర్వాత పనులన్నీ పూర్తయ్యాయి. రన్‌వే పెంపుతో పాటు రన్‌వే లైటింగ్, అప్రోచ్ లైటింగ్, పార్కింగ్ బే లైటింగ్, 2.5 కిలోమీటర్ల రన్‌వే, సెక్యూరిటీ, పెరిమీటర్ లైటింగ్, పెరిమీటరు రోడ్డు తదితర పనులు పూర్తయ్యాయి. దీంతో నైట్ ల్యాండింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా విమానాలు దిగేందుకు అవకాశం ఉంటుంది.


అత్యాధునిక సౌకర్యాలు

కడప విమానాశ్రయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి నిధులు విడుదల కావడంతో పనులు త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఆ దిశగా ఇక్కడి అధికారులు అడుగులు వేస్తున్నారు. ఎస్కలేటర్, అధునాతనమైన లిఫ్ట్, సెంట్రలైజ్డ్ ఏసీ, బ్యాగేజీ కన్వేయర్ బెల్ట్, మూడు ఏరో బ్రిడ్జిలు, టెర్మినల్ భవనం, ఇతరత్రా పనులను చేపట్టనున్నారు. అంతేకాకుండా న్యూ కారు పార్కింగ్, అప్రోచ్‌రోడ్లు, బ్యూటిఫికేషన్ పనులు కూడా చేపట్టనున్నారు.



ఏర్పాటు కానున్న ఏరో బ్రిడ్జి

విమానాశ్రయ అభివృద్ధికి కృషి



కడప విమానాశ్రయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ధన్యవాదాలు. ప్రస్తుతం నైట్ ల్యాండింగ్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. త్వరలో రూ. 224.05 కోట్లతో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవనం, ఇతర పనులను చేపట్టనున్నాము. విమానాశ్రయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం. అధునాతన సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం.

– సుజిత్‌కుమార్ పొద్దర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, కడప

కొత్త టెర్మినల్‌లో 700 మంది ప్రయాణికుల సౌకర్యం



ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనంలో 40+40 (80) మందికి మాత్రమే అవకాశం ఉంది. కొత్త టెర్మినల్ పూర్తయితే మొత్తం 700 మందికి రాకపోకలు సాగించే అవకాశాలు ఉంటాయి. ఏడు విమానాలు పార్కింగ్ చేసేందుకు ఇక్కడ అవకాశం ఉంది. అభివృద్ధి పనులు పూర్తయితే ఏ–320 (180మంది) ప్రయాణికులు ప్రయాణించే పెద్ద విమానాలు ఇక్కడి నుంచి నడిపేందుకు వీలు ఉంటుంది.

పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు



కడప విమానాశ్రయంలో పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా కూడా పైలెట్ శిక్షణా కేంద్రం లేదు. ప్రప్రథమంగా కడప విమానాశ్రయంలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చేనెల 25, 26 తేదీల్లో ఇందుకు సంబంధించి ప్రణాళిక ఖరారు కానుంది. తర్వాత ఈ శిక్షణా కేంద్రం పనులు చేపట్టే అవకాశం ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 రోజులు శిక్ష

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ, తిరుణంపల్లి అరుంధతివాడకు చెందిన దండు నవీన్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ శివ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నవీన్‌పై కేసు నమోదు చేయగా నందలూరు సివిల్ జడ్జి కె లత రూ. 1000 జరిమానా, 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు వారు తెలిపారు.

దంపతుల గొడవలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : కుటుంబ సమస్యలతో దంపతుల మధ్య జరిగిన గొడవలో వారితో పాటు కుమార్తె గాయపడిన సంఘటన సోమవారం మండలంలోని బాబూకాలనీలో జరిగింది. నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెకు చెందిన బావాజీ(40) బాబూకాలనీకి చెందిన అబీదా(35)ను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఏడాది నుంచి భార్య అబీదా పుట్టింటిలో ఉంటోంది. భర్తతో విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో సోమవారం బావాజీ అత్తగారిల్లు అయిన బాబూకాలనీకి వచ్చాడు. భార్యాభర్తలు కుటుంబ సమస్యలతో గొడవపడ్డారు. గొడవను వారించేందుకు వచ్చిన కుమార్తె నాజిని(11)తో పాటు భార్యాభర్తలు గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం తురకపల్లెకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు జావీద్(24) డిగ్రీ పూర్తిచేశాడు. ఇటీవల పలు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంటివద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అదేవిధంగా మదనపల్లె మండలం కొండామర్రిపల్లె ఇసుకనూతిపల్లె పంచాయతీకి చెందిన బాలలింగప్ప కుమారుడు ఎం.శ్రీనివాసులు(44) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్ వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి (30) అనే యువకుడు సోమవారం తెల్లవారు జామున అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు గత కొంత కాలం నుంచి అప్పులు ఎక్కువయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో ఆందోళన చెందేవాడు. దీంతో సోమవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు.

రిమ్స్ ఫార్మసీలో అస్తవ్యస్తం!

- సమయపాలన పాటించని కొందరు సిబ్బంది
- ప్రతిష్టాత్మకమైన 'ఈ – ఔషధీ', 'ఈ – హాస్పిటల్' ఎంట్రీలలో నిర్లక్ష్యం
- మందుల సరఫరా, వినియోగంలో అవకతవకలు



కడప రిమ్స్ ఓపీలో ఫార్మసీ విభాగం

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు సంబంధించి మందులను, వారికి కావాల్సిన ఇంజక్షన్‌లను సైతం సరఫరా చేయాల్సిన విభాగం 'ఫార్మసీ'. ఈ విభాగం సర్వజన ఆసుపత్రి ఐపీ, ఓపీ విభాగాలకు చాలా కీలకమైన విభాగం. ఈ విభాగంలో మొత్తం 22 మంది ఫార్మసిస్ట్ గ్రేడ్–2లు, గ్రేడ్–1లు ఇద్దరు, ఒక సూపర్‌వైజర్ విధులను నిర్వహిస్తున్నారు. వీరందరిలో కొందరు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి ఉదయం వరకు జనరల్ షిఫ్ట్‌లో కొందరు విధులను నిర్వహించాల్సి ఉంది. వీరిలో కొందరు సమయపాలన పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీరు విధులకు హాజరు కాగానే మందులను ఇవ్వడం, ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్య సేవలను పొందిన వారి వివరాలను 'ఈ– ఔషధీ', ఈనెల నుంచి 'ఈ– హాస్పిటల్'లలో విధిగా నమోదు చేయాల్సి ఉంది.

- కానీ సర్వర్ సమస్య ఉందని, ఇతర కారణాలను చూపి ఆయా వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- ఐపీ, ఓపీ విభాగాలలో మందుల సరఫరా వివరాలను నమోదు, పంపిణీలో కూడా కొన్ని అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- కాలం చెల్లిన మందులు అనే అంశం దరిదాపుల్లోకి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అక్కడి అధికారులు, సిబ్బంది పైన ఎంతో ఉంది. కానీ కరోనా సమయంలో ఎంతో అత్యవసరంగా ఉపయోగించిన డ్రగ్స్ 'రెమ్‌డెసీవర్'లు ఎక్కువ సంఖ్యలో కాలం చెల్లిపోయినా, వాటిని అలాగే భద్రంగా దాచుకుని ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఇంకా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు ఈ విషయంపై సమగ్రంగా విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.
- ఇంకా వార్డులకు సరఫరా చేసే మందుల విషయంలో వందల సంఖ్యలో తేడాలను గమనించవచ్చు. అలాగే కొన్ని మందుల కాలపరిమితి నెలలోపు ఉన్నా వాటిని సరఫరా చేస్తున్నారు. మాస్కులను సరఫరా చేస్తున్న వ్యవహారం కూడా మందకొడిగా సాగుతోంది. ఇక్కడి రిజిస్టర్‌లను, బిల్లులను, వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్జికల్, మెడికల్ విభాగాలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్, లోకల్‌గా కొనుగోలు చేస్తున్న మందులు, పరికరాల వ్యవహారంపై కూడా అధికారులు నిశితంగా పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతిరోజు ఇక్కడికి వేల సంఖ్యలో ప్రజలు మందుల కోసం వస్తుంటారు. వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి. మందుల సరఫరా, సద్వినియోగం అయ్యేంతంగా చూసుకోవాల్సిన బాధ్యత ఫార్మసీ విభాగం, పర్యవేక్షణ అధికారుల పైనా ఉంది. అక్కడికి వచ్చే రోగులపట్ల కొందరు సిబ్బంది కటువుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫార్మసీ విద్యార్థులతో పనులు చేయించుకుంటున్న సిబ్బందిలో కొందరు మాత్రం తమ సెల్‌ఫోన్‌లలో నిమగ్నం కావడం, లేదంటే రిలాక్స్‌గా ఆసుపత్రి అంతా బలాదూర్ తిరగడం షరా మామూలై పోయింది.

ఫార్మసీ విభాగంలో సమగ్రంగా విచారణ చేస్తాం

కడప రిమ్స్ ఫార్మసీ విభాగంలో ఇటీవల కడప నగరపాలక కమిషనర్ అడ్మినిస్ట్రేటర్ హోదాలో వచ్చి తనిఖీలు నిర్వహించారు. సమయపాలన, కాలం చెల్లిన మందుల వ్యవహారాన్ని పరిశీలిస్తాం. ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ రమాదేవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్),కడప

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


రాజుపాలెంలో సీజ్ చేసిన ఎరువుల వద్ద విజిలెన్స్ అధికారులు

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఇందులో భాగంగా శ్రీకృషి ఆగ్రో సీడ్స్ పురుగు మందుల దుకాణంలో అధికారులు తనిఖీ చేయగా డీఏపీ ఎరువును ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్ముతుండటంతో రూ.17,550 విలువైన డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకుని మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డికి అప్పగించారు. సంబంధిత డీలర్‌పై 6 (ఏ) కింద కేసు నమోదు చేయమని ఆశాఖ అధికారులు సూచించారు. అలాగే శ్రీ మణ్యం ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణంలో ఎరువులకు సంబంధించి రికార్డులను సక్రమంగా నమోదు చేయనందు వలన రూ.3,57,210 విలువైన ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నోటీసులను సంబంధిత దుకాణ యజమానికి విజిలెన్స్ అధికారులు అందించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ సీఐ టి.రెడ్డప్ప, విజిలెన్స్ వ్యవసాయాధికారి బాల గంగాధర రెడ్డి, ఏఈఈ అశోక్ కుమార్, మండల వ్యవసాయాధికారి శివరామ కృష్ణారెడ్డి, విజిలెన్స్ పోలీసులు జనార్దన రావు, సుదర్శన్ రెడ్డి, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

విజేతలుగా వెస్ట్ గోదావరి జట్లు


జూనియర్ బాలుర విభాగంలో విజేతలు పశ్చిమగోదావరి జట్టు


సీనియర్ మహిళల విభాగంలో విజేతలు పశ్చిమగోదావరి జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాసంబరం
- బహుమతులు అందజేసిన అతిథులు

కడప స్పోర్ట్స్ : 9వ ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌లుగా పశ్చిమగోదావరి జట్లు నిలిచాయి. గత మూడు రోజులుగా కడప నగరం వేదికగా నిర్వహించిన 9వ ఏపీ హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర విభాగం చాంపియన్‌షిప్–23 విజయవంతంగా ముగిశాయి. సోమవారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అనంతరం టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప నగర డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ సూర్యనారాయణరావు, రాజారత్నం ఐజాక్, రోడా మెర్సీ, క్రీడాపోషకులు కంచి గోపీకృష్ణ, కంచి సురేంద్రనాథ్‌లు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం వేదికగా రాష్ట్రస్థాయి క్రీడాసంబరం విజయవంతంగా ముగిసిందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చక్కటి ఏర్పాట్లు చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేశారన్నారు. టోర్నమెంట్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, మెడల్స్‌ను అందజేశారు. టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన కడప క్రీడాకారిణి పల్లవికి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎ. సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటసునీల్, కోశాధికారి బాబర్, బసిరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, వివిధ జిల్లాల టెక్నికల్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు.


బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకుంటున్న కడప క్రీడాకారిణి పల్లవి

విజేతల వివరాలు..

అండర్–19 బాలుర విభాగం : పశ్చిమగోదావరి (ప్రథమస్థానం), చిత్తూరు (ద్వితీయస్థానం), విజయనగరం, కర్నూలు (తృతీయస్థానం).

సీనియర్ మహిళలు : పశ్చిమగోదావరి (ప్రథమస్థానం), కృష్ణ (ద్వితీయస్థానం), కడప (తృతీయస్థానం).

ఆధిక్యంలో కర్నూలు జట్టు

మహేంద్రయాదవ్ డబుల్ సెంచరీ నమోదు


మహేంద్రయాదవ్, కర్నూలు (201 పరుగులు)


మనోజ్‌రాజు, కర్నూలు (146 పరుగులు)


సుబ్రమణ్యం (నెల్లూరు) 74 పరుగులు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో రెండోరోజు సోమవారం 26 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 101.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 424 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్రయాదవ్ 246 బంతుల్లో 24 ఫోర్లు, 8 సిక్సర్లతో 201 పరుగులు చేశాడు. ఈయనతో పాటు జి.మనోజ్‌రాజు 251 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 146 పరుగులు చేశాడు. అనంత బౌలర్ కమిల్ 3 వికెట్లు తీశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి కర్నూలు జట్టు 140 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. అనంత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మరో మ్యాచ్‌లో 129 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 88.4 ఓవర్లలో 347 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని సుబ్రమణ్యం 74 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దీపన్‌సాయినాథ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని పన్నీర్‌సెల్వం 59 పరుగులు, భవానీప్రసాద్ 50 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు నారాయణ 1, అఖిల్ 1, అజిత్ 1 వికెట్ తీశారు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 8 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

సారా సరఫరాదారుడి కోసం పోలీసుల ఛేజింగ్

- తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం
- ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

మదనపల్లె : నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకునే ప్రయత్నంలో వెంబడించడంతో ద్విచక్రవాహనాన్ని వేగంగా నడుపుతూ మార్గమధ్యంలో రోడ్డుపై వెళుతున్న పాదచారిని ఢీకొన్న ఘటన సోమవారం జరిగింది. మండలంలోని వలసపల్లె పంచాయతీ జ్యూస్‌ఫ్యాక్టరీ కృష్ణాపురానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కన్నయ్య కుమారుడు నాగరాజు(55) మూడురోజుల క్రితం వచ్చాడు. సోమవారం ఉదయం రోడ్డుపై నడిచి వెళుతుండగా, పుంగనూరు నుంచి అతివేగంగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఓ వ్యక్తి నాగరాజును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడగా నాగరాజు గాయపడ్డాడు. అయితే నాగరాజును ఢీకొన్న వ్యక్తి అక్రమంగా నాటుసారాను తరలిస్తుండగా పుంగనూరు పోలీసులు వెంబడించడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన వ్యక్తిని పుంగనూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) మల్లికార్జున (ఫైల్)

గాలివీడు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మల్లికార్జున(36) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని అరవీడు పంచాయతీ ఎల్లంపల్లికి చెందిన కానిస్టేబుల్ మల్లికార్జున రాయచోటి పట్టణంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి రాయచోటి పట్టణంలో ఎంజీ గ్రాండ్ ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీ కొన్న సంఘటనలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

2011 బ్యాచ్‌కు చెందిన మల్లికార్జున రాయచోటి సర్కిల్‌లో చిన్నమండెం, రాయచోటి, సంబేపల్లె, రామాపురం, పోలీస్ స్టేషన్‌లలో, ఐటీ శాఖలో విధులు నిర్వహించాడు. పోలీస్ శాఖలో మంచిపేరు తెచ్చుకున్నాడు. మల్లికార్జున మృతదేహానికి గాలివీడు మండల అరవీడు గ్రామం ఎల్లంపల్లిలో బంధువులు, అభిమానుల మధ్య ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ సుధాకర్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రాయచోటి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, బంధువులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే సంతాపం

కానిస్టేబుల్ మృతి పట్ల ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ పోటీలు


వైవీయూలో రోడ్‌రేస్‌ను ప్రారంభిస్తున్న రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలోని స్కేటింగ్ రింక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. లక్ష్మినాథ్‌రెడ్డి, కార్యదర్శి పి. ఇజ్రాయిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా అంతకు మునుపు యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రోడ్‌రేస్ కాంపిటీషన్‌ను వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ సిబ్బంది నారాయణ, స్కేటింగ్ శిక్షకుడు విలియం కేరీ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్కాజోలికి వెళితే కఠినచర్యలు

- కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు
- నలుగురు మట్కా బీటర్లు అరెస్ట్, రూ. 60,000 నగదు, మట్కా స్లిప్‌లు సీజ్


మట్కా బీటర్ల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్ : మట్కా మహమ్మారి జోలికి ఎవరైనా వెళితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తమ సిబ్బందితో కలిసి మట్కా బీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. సోమవారం సీఐ నాగరాజు తమకు అందిన పక్కా సమాచారంతో కృష్ణ, రమేష్ థియేటర్ పరిసర ప్రాంతాల్లో మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 60,000 నగదుతో పాటు, 8 మట్కా స్లిప్‌లు, 4 బాల్‌పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, వై.వీ స్ట్రీట్‌కు చెందిన సుంకేసుల శ్రీరాములు, కుమ్మరకుంట వీధికి చెందిన పఠాన్ షఫీవుల్లా ఖాన్, రాధాకృష్ణనగర్‌కు చెందిన షేక్ మదార్‌బాషా ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు

అక్కడికక్కడే వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటసుబ్బారెడ్డి, ఫైల్‌ఫొటో

గోపవరం : మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్–67) ద్వారకనగర్ వద్ద బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న కత్తెరపల్లె వెంకటసుబ్బారెడ్డి (48) అక్కడికక్కడే మృతి చెందాడు. బి.కోడూరు మండలం అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా బద్వేలు పట్టణంలోని ఆంజనేయనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బద్వేలు నుంచి పి.పి.కుంట వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా హైదరాబాద్ నుంచి బద్వేలు మీదుగా నెల్లూరు దర్గాకు వెళుతున్న ఇన్నోవా కారు ముందు వెళుతున్న బైక్‌ను అతివేగంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి దాదాపు 15 అడుగుల దూరంలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను ఢీకొన్న కారు సంఘటన స్థలంలో ఆపకుండా వెళ్లిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న వ్యక్తులు పి.పి.కుంట చెక్‌పోస్టుకు సమాచారం ఇవ్వడంతో విధుల్లో ఉన్న చెక్‌పోస్టు సిబ్బంది, పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇన్నోవా కారును స్టేషన్‌కు తరలించారు. కాగా మృతునికి ఇప్పటి వరకు పిల్లలు లేకపోవడంతో అతని భార్య చెన్నైలో ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె చెన్నైలో ఉన్నారు. వెంకటసుబ్బారెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విలపించారు.

గ్రామంలో విషాద ఛాయలు

బి.కోడూరు : మండలంలోని అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన కత్తెరపల్లె వెంకటసుబ్బారెడ్డి (48) సోమవారం గోపవరం మండలం ద్వారకనగర్ వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మృతుని గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన అంకనగొడుగునూరు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన అమరప్ప కుమారుడు సి.వెంకటేష్(25) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం గ్రామంలోని రైతుల వద్ద పూలు సేకరించి ఆటోలో మదనపల్లెకు బయలుదేరాడు. బార్లపల్లె సమీపంలోని గోకులం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడగా, వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెకు చెందిన అమీర్ కుమారుడు పి.బాబ్జీ(40) ద్విచక్రవాహనంలో నిమ్మనపల్లెకు వస్తూ అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.